# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ:  26-10-2025          సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- నిజాం పాలనపై కొమరం భీమ్ చేసిన పోరాటాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ `మన్ కీ బాత్` కార్యక్రమంలో కొనియాడారు.
- మొంథా తుపానును ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సిద్ధంగా వుండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.
- రైతులు ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.
- ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం రానున్న 24 గంటల్లో తుఫానుగా బలపడే అవకాశం ఉందని విశాఖపట్టణంలోని తుఫాను హెచ్చరికల కేంద్రం వెల్లడించింది.

========================

నిజాం పాలనపై తెలంగాణ యోధుడు కొమరం భీమ్ చేసిన పోరాటాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. నేటి మన్ కీ బాత్ 127వ సంచికలో ఆయన మాట్లాడారు. కేవలం 40 ఏళ్లే బతికినా.. ప్రజలపై చెరగని ముద్రను కొమరం భీమ్ వేశారని.. నిజాంకు చాలా కాలం పాటు సవాలుగా నిలిచారని పేర్కొన్నారు. 1940లో నిజాం సైనికులు ఆయనను హత్య చేశారని తెలిపారు. కొమరం భీమ్ గురించి తెలుసుకునేందుకు యువత వీలైనంత ప్రయత్నించాలని ప్రధానమంత్రి సూచిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

మన రక్షణ దళాలు భారతీయ సంతతికి చెందిన శునకాల సేవలను ఉపయోగించుకోవడం ఆనందంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈరోజు మన్ కీ బాత్.. మనసులోని మాట కార్యక్రమం 127వ సంచికలో ఆయన మాట్లాడుతూ.. బి.ఎస్.ఎఫ్., సి.ఆర్.పి.ఎఫ్. తమ బృందాలలో భారతీయ సంతతికి చెందిన శునకాల సంఖ్యను పెంచారని

పేర్కొన్నారు. అనేక ఆపరేషన్లలో భారత సంతతి శునకాలు విశేష ప్రతిభ కనబరిచాయన్నారు. అక్టోబర్ 31న జరగనున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని ప్రధాని గుర్తు చేసుకున్నారు. భారత పూర్వ ఉప ప్రధానమంత్రి వల్లభాయ్ పటేల్ ఆధునిక కాలంలో దేశంలోని ప్రముఖులలో ఒకరని నరేంద్రమోదీ పేర్కొన్నారు. సర్దార్ పటేల్ పరిశుభ్రత, సుపరిపాలనకు ప్రాధాన్యత ఇచ్చారని, భారతదేశాన్ని ఏకం చేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారని ప్రధానమంత్రి అన్నారు. అక్టోబర్ 31న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ఐక్యతా పరుగు కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. బంకిం చంద్ర ఛటర్జీ స్వరపరిచిన భారత జాతీయ గీతం 'వందేమాతరం'ను గుర్తు చేసుకున్న ప్రధానమంత్రి, 2025, నవంబర్ 7న భారతదేశం 'వందేమాతరం' 150వ వేడుకల్లోకి అడుగుపెడుతుందన్నారు.

=======================

మొంథా తుపానును ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సిద్ధంగా వుండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ రోజు అధికారులతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వాయుగుండం ఈనెల 28వ తేదీ నాటికి తీవ్రమైన తుఫానుగా మారుతుందని, ఈ సమయంలో ఎక్కడా ఎటువంటి ప్రాణ-ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మచిలీపట్నం నుంచి కాకినాడ ప్రాంతం వరకు తుఫాను తీవ్ర ప్రభావం చూపిస్తుందని, ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేలా హెచ్చరికలు పంపించాలన్నారు. రిజర్వాయర్లలో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించి అందుకు అనుగుణంగా కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

=======================

రైతులు ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేస్తున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుతో కలిసి మంత్రి రవి కుమార్ ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యవసాయ రంగాన్ని గాడిలో పెట్టి రైతన్నను ఆదుకునేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

విరామం

=======================

ఈ నెల 31వ తేదీన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని అనంతపురంలో సమైక్యత ర్యాలీ నిర్వహిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఈ రోజు అనంతపురంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... దేశ ఐక్యత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================

ప్రతి నెల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే మన్ కీ బాత్.. మనసులోని మాట కార్యక్రమాన్ని ఈ రోజు బాపట్ల జిల్లా ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఆపరేషన్ సిందూర్, జీఎస్టీ శ్లాబులు తగ్గింపు విషయంలో ప్రధాని మోదీ మాటలతో తాము ఏకీభవిస్తున్నామన్నారు. మరోవైపు ప్రధానమంత్రి నూతన సంస్కరణలు దేశంలోని అట్టడుగువర్గాల ఆర్థిక స్వావలంబనకు ఎంతగానో ప్రయోజనాన్ని చేకూర్చుతున్నాయని స్థానికుడు శేషగిరిరావు పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

=======================

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం రానున్న 24 గంటల్లో తుఫానుగా బలపడే అవకాశం ఉందని విశాఖపట్టణంలోని తుఫాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. ఈ తుఫాను వాయువ్య దిశగా, ఆ తరువాత ఉత్తర-వాయువ్య దిశగా కదులుతూ.. ఈనెల 28 నాటికి తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందని కేంద్రం అధికారి జగన్నాథ కుమార్ తెలిపారు. తుఫానుతో పాటు ఆంధ్రప్రదేశ్, యానాంలో ఈశాన్య, ఆగ్నేయ దిశగా గాలులు వీస్తున్నాయని, వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు అనేక చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=========================

బంగాళాఖాతంలోని తీవ్రవాయుగుండం 24 గంటల్లో తుపానుగా బలపడనున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ సంస్థ శాఖా మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నుంచి ఆమె పర్యవేక్షణ చేశారు.

=========================

=========================